సాక్షి రంగారెడ్డి
శనివారం । 22 । ఏప్రిల్ । 2023



గాలివాన బీభత్సం

చేవెళ్ల మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.

12లో▸

నేడు మ్యూజియానికి సెలవు



చార్మినార్: రంజాన్ పండుగను పురస్కరించుకొని శనివారం సాలార్‌జంగ్ మ్యూజియానికి సెలవు ఉంటుందని మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్ రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని సందర్శకులు గమనించాలన్నారు. తిరిగి ఆదివారం నుంచి యథావిధిగా సందర్శన ఉంటుందన్నారు.

ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు

ఇబ్రహీంపట్నం రూరల్: రంజాన్ పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కలెక్టర్ హరీశ్ అన్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేశారన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం వెల్లి విరియాలని ఆకాంక్షించారు. ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలకు ఈద్ ఉల్ ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌రీల్

కరుణాకర్‌రెడ్డి హత్య కేసులో మరో నిందితుడి అరెస్టు

కొత్తూరు: సంచలనం సృష్టించిన డాక్యుమెంట్ రైటర్ అపహరణ, హత్య కేసుకు సంబంధించి మరో నిందితుడిని కొత్తూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మల్లాపూర్ గ్రామానికి చెందిన పిన్నింటి విష్ణువర్ధన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. కరుణాకర్‌రెడ్డి హత్య కేసులో ఇతను కూడా నిందితుడిగా ఉన్నాడు. పరారీలో ఉన్న విష్ణువర్ధన్ రెడ్డిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆహార శాలల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ రంగ సంస్థల ఆధీనంలోని స్టాల్స్‌లో చేపల లీజు పద్ధతిపై ఆహారశాలల నిర్వహణ కోసం ఆసక్తి గల మత్స్య సహకార సంఘాలు, మహిళా గ్రూపులు శిక్షణ పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్ స్టేషన్ స్టాల్ లేదా ఖాళీ స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య లీజుకు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. నెలకు చెల్లించాల్సిన కిరాయి కూడా నిర్ణయిస్తారన్నారు. ఆసక్తి గల మత్స్య సహకార సంఘాలు లేదా మహిళా గ్రూపు, శిక్షణ పొందిన ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. మొదటి ప్రాధాన్యత సంఘాలకు, రెండో ప్రాధాన్యత మహిళకు గ్రూపులకు, మూడో ప్రాధాన్యత ఎస్‌ఐటీహెచ్ ఎంలో శిక్షణ పొందిన వారికి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒకే స్టాల్‌కు ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతిపై కేటాయిస్తామన్నారు.

విభిన్నంగా.. వినూత్నంగా..!



సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ పోలీసుల విధుల్లో అత్యంత కీలకమైన ఎడ్యుకేషన్‌పై (అవగాహన కల్పించడం) నగర పోలీసు విభాగం ప్రత్యేక దృష్టి పెట్టింది. రహదారి భద్రత నిబంధనలపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలంటూ సిబ్బందికి ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్ బాబు ఆదేశించారు. సోషల్ మీడియాను వినియోగిస్తూ, వాహనచోదకులను ఆకట్టుకునేలా మీమ్స్, పోస్టర్లు రూపొందించడంపై ట్రాఫిక్ వింగ్ దృష్టి పెట్టింది. కొన్నాళ్లుగా ఈ తరహాకు చెందినవి ట్రాఫిక్ పోలీసుల అధికారిక సోషల్‌మీడియా ఖాతాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. శుక్రవారం రూపొందించిన పోస్టర్ మాత్రం వివిధ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. ప్రముఖ బ్రాండ్లకు చెందిన 9 కంపెనీల పేర్లను ఎంపిక చేసుకున్న ట్రాఫిక్ అధికారులు వాటికి అటు–ఇటు పదాలు జోడిస్తూ అర్థవంతమైన వ్యాఖ్యలుగా మార్చారు. ఈ పోస్టర్ నెటిజనులను విపరీతంగా ఆకర్షిస్తోంది.

అందరి దృష్టి చేవెళ్లపైనే..

- రేపే బీజేపీ 'విజయ సంకల్ప సభ'..
- హాజరు కానున్న అమిత్‌షా
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలపైనే ప్రధాన ఫోకస్
- ఏర్పాట్లలో పార్టీ నేతలు
- భారీగా తరలివస్తారని అంచనా



సభా స్థలిని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అధికార, ప్రతిపక్ష పార్టీల దృష్టి చేవెళ్లపై పడింది. ఆదివారం చేవెళ్ల పట్టణ కేంద్రంగా బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహిస్తుండటం, ఆ పార్టీ అగ్రనేత, హోంమంత్రి అమిత్‌షా హాజరవుతుండటమే ఇందుకు కారణం. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటం, సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి చర్యలు చేపడుతుండటం, ఇతర పార్టీల్లో అసంతృప్తితో ఉన్న ద్వితీయశ్రేణి నేతలు తమ రాజకీయ భవిష్యత్తును వెతుక్కుంటుండటం, ప్రజాదరణ కలిగిన నేతలను బీజేపీ ఆహ్వానిస్తుండటంతో అందరిలోనూ టెన్షన్ మొదలైంది. అమిత్‌షా పాల్గొనే బహిరంగ సభకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఏ నియోజకవర్గం నుంచి ఎవరు.. ఎంత మంది జనాన్ని సమీకరించబోతున్నారు? బహిరంగ సభలో అమిత్‌షా ఏం మాట్లాడబోతున్నారు? ఈ వేదికపై ఏమైనా ముఖ్యమైన చేరికలు ఉంటాయా? వేదిక ద్వారా జిల్లా ప్రజలకు ఏం చెప్పదల్చుకున్నారు? వంటి అంశాలపై అధికార బీఆర్‌ఎస్ సహా ప్రతిపక్ష కాంగ్రెస్‌లోనూ ప్రధానంగా చర్చ జరుగుతోంది.

పల్లెల్లో పాగా వేసేందుకు యత్నం

పట్టణ ప్రాంతాలతో పోలిస్తే..గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ కొంత బలహీనంగా ఉంది. 2024లో మళ్లీ అధికారంలోకి రావాలంటే ఇప్పటి వరకు ఒక్కసారి కూడా విజయం సాధించని 160 పార్లమెంట్ స్థానాలపై బీజేపీ అగ్రనాయకత్వం దృష్టి సారించింది. ఎలాగైనా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ జెండా ఎగరవేయాలనే వ్యూహంతో ముందుకు సాగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీపై ప్రజల్లో ఉన్న క్రేజ్‌ను వచ్చే ఎన్నికల్లో ఓట్లరూపంలో మలుచుకునేందుకు పక్కా ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటి వరకు సంస్థాగతంగా బలమైన లీడర్, కేడర్ లేని ప్రాంతాలను ఇందుకు వేదికగా ఎంచుకుంది. ఆయా ప్రాంతాల్లో అగ్రనాయకత్వంతో బహిరంగ సభలు, సమీక్ష సమావేశాలు నిర్వహించడం ద్వారా పార్టీ కేడర్‌లో జోష్ పెంచి, సంస్థాగతంగా బలపడొచ్చని భావిస్తోంది. ఈ మేరకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఇందుకు వేదికగా ఎంపిక చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను, తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర స్థాయిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, కుటుంబ పాలన, అవినీతి వంటి అంశాలే ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో వారి ఆదరాభిమానాలు చూరగొనాలని యోచిస్తోంది.

రేపే.. 'విజయ సంకల్ప సభ'

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఆదివారం భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసింది. సాయంత్రం ఐదు గంటలకు పార్టీ అగ్రనేత, హోంమత్రి అమిత్‌షా ఈ సభకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిధిలోని చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలే లక్ష్యంగా భారీ జనసమీకరణ చేయాలని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. తద్వారా పార్టీకి మారుమూల ప్రాంతాల్లోని ప్రజల్లో మంచి ఆదరణ ఉందనే విషయం చాటి చెప్పాలని యోచిస్తోంది. హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల నుంచి కీలక నేతలు హాజరు కానున్నారు. వీరితో పాటు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ సభకు తరలిరానుండటంతో నిర్వాహకులు ఈ మేరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి బూత్‌ల వారీగా కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించారు. మూడు సభావేదికలను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు లక్ష మందిని తరలించాలని లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ.. గ్రౌండ్‌లో 30 వేల కుర్చీలు వేస్తున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షాన్ని తట్టుకునే విధంగా వేదికలను ఏర్పాటు చేశారు. బహిరంగ సభ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వికారాబాద్ వైపు వెళ్లే వాహనాలను ముడిమ్యాల నుంచి చేవెళ్ల బైపాస్ మీదుగా మళ్లించనున్నారు. చేవెళ్లకు చేరుకునే నాలుగు ప్రధాన మార్గాల్లోనూ పార్కింగ్ సదుపాయం కల్పించారు.



సభ కోసం ఏర్పాట్లు

'తట్టు'కునేదెలా..!

విస్తరిస్తున్న మిజిల్స్

- వైరస్ గుప్పిట్లో చిన్నారులు
- పట్టణ ప్రాంతాల్లో భారీగా నమోదవుతున్న కేసులు
- రోజురోజుకూ పెరుగుతున్న సంఖ్య
- వ్యాక్సినేషన్‌పై అవగాహన కరువు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమంపై నీలినీడలు కమ్ముకున్నాయి. చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతి బుధ, శనివారాల్లో ఉచితంగా పలు వ్యాక్సిన్లు సరఫరా చేస్తోంది. క్షేత్రస్థాయిలోని కొంత మంది వైద్య సిబ్బంది నిర్లక్ష్యం, వ్యాక్సిన్లపై ఓ వర్గం ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఫలితంగా పూర్తిగా కనుమరుగై పోయిందనకున్న మిజిల్స్ (చికెన్‌పాక్స్, అమ్మతల్లి, తట్టు) కారక వైరస్ మళ్లీ ప్రతాపం చూపిస్తోంది. జనాభా ఎక్కువగా ఉన్న పట్టణ ప్రాంతాల్లో ఈ వైరస్ ఎక్కువగా విజృంభిస్తుంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు జిల్లాలో అధికారికంగా 200కుపైగా కేసులు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం. అనధికారికంగా సంఖ్య మరింత ఎక్కువగా ఉన్నట్లు అంచనా. మూఢనమ్మకాలకు తోడు చికిత్సను నిర్లక్ష్యం చేయడంతో ఏటా అనేక మంది చిన్నారులు మృత్యువాతపడుతున్నారు.

సిటీ శివారు బస్తీల్లో అధికం

మైలార్‌దేవులపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలోనే ఇప్పటి వరకు 61 అనుమానిత మిజిల్స్ కేసులు గుర్తించగా, వీటిలో 52 పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యాయి. ఇక బాలాపూర్‌లో 39 అనుమానిత కేసులు గుర్తించగా, వీటిలో 33 పాజిటివ్‌గా తేలింది. సరూర్‌నగర్ పరిధిలో 11కేసులు గుర్తించగా, తొమ్మిది పాజిటివ్ వచ్చాయి. శేరిలింగంపల్లిలో 18 కేసులు గుర్తించగా, వీటిలో 16 పాజిటివ్‌గా తేలింది. హసన్‌నగర్‌లో 16 గుర్తించగా, 13 పాజిటివ్ వచ్చాయి. నార్సింగి పీహెచ్‌సీ పరిధిలో 7 గుర్తించగా 5 కేసులు, అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో 5 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఒకరి నుంచి మరొకరికి వేగంగా వైరస్ విస్తరిస్తుండటంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. మారుమూల గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే సిటీకి ఆనుకుని ఉన్న శివారు బస్తీల్లోనే కేసులు అధికంగా నమోదవుతుండటం విశేషం. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ప్రతి 2,500 మందికి ఒక ఆశాను, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి ఒక ఆశా చొప్పున నియమించింది. వీరు విధిగా తమ వద్ద ఉన్న వ్యాక్సిన్ డ్యూలిస్ట్‌ను చెక్ చేసి, లబ్ధిదారులకు ముందే ఆ సమాచారం ఇవ్వాల్సి ఉన్నా.. జిల్లాలోని మెజార్టీ ఆశాలు ఆ పని చేయకపోవడం కూడా కేసుల తీవ్రతకు మరో కారణమని తెలిసింది.

చెప్పేవారు లేక..

తల్లీబిడ్డల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు రకాల వ్యాక్సిన్లు ఉచితంగా అందిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రిలో పుట్టిన బిడ్డకు వెంటనే(24 గంటల్లోపు) బీసీజీ, హెపటైటిస్ బి, పోలియో చుక్కలు వేస్తారు. వీటిని జీరో డోసుగా పరిగణిస్తుంటారు. సాధారణంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉండదు. ఇక్కడ విటమిన్–కె మాత్రమే ఇస్తుంటారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత బిడ్డకు నెలలోపు బీసీజీ, 14 రోజులలోపు పోలియో చుక్కలు వేస్తారు. ఆ తర్వాత 45 రోజులకు పెంటా వ్యాక్సిన్, పోలియో చుక్కలు, రోటా వైరస్, ఐపీవీ వ్యాక్సిన్లు ఇస్తుంటారు. రెండున్నర నెలలకు సెకండ్ డోసు, మూడున్నర నెలలకు మూడో డోసు, తొమ్మిది నెలలకు ఎంఆర్ (మిజిల్స్ అండ్ రూబెల్లా) ఫస్ట్ డోసు, ఆ తర్వాత ఆరు నెలలకు ఎంఆర్ రెండో డోసు ఇస్తుంటారు. ఐదేళ్లకు డీటీ(డిఫ్తీరియా), పదేళ్లకు టీటీ (సెప్టిక్ నియంత్రణ వ్యాక్సిన్), 16 ఏళ్లకు టీటీ సెకండ్ డోసు వ్యాక్సిన్ ఇవాల్సి ఉంది. క్షేత్ర స్థాయిలోని ఆశాలు, ఏఎన్‌ఎంలు డ్యూలిస్ట్ ప్రకారం పిల్లలను గుర్తించి, సకాలంలో వ్యాక్సిన్లు వేయించడం లేదు. తల్లిదండ్రులు కూడా మరిచిపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో పెద్ద సంఖ్యలో వెలుగు చూస్తున్న మిజిల్స్ కేసులకు ఇదే ప్రధాన కారణమని వైద్యనిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వేగంగా విస్తరిస్తుండటంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇటీవల ఇంటింటి సర్వే చేపట్టి..వ్యాక్సిన్ వేయించుకోని పిల్లలను గుర్తించి వారికి అక్కడిక్కడే ఎంఆర్ వ్యాక్సిన్ వేసే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికీ ఓ వర్గం ప్రజలు వ్యాక్సిన్ నిరాకరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

రెండు వారాల పాటు తీవ్రత

చికెన్‌పాక్స్ వైరస్ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వేగంగా విస్తరిస్తుంది. మొదట చెవు వెనుక భాగంలో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఛాతి, ముఖం ఇలా శరీరం మొత్తం విస్తరిస్తుంది. చర్మంపై నీటితో కూడిన బొబ్బలు కన్పిస్తాయి. దగ్గు, జలుబు, జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులు, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. రెండు వారాల పాటు వైరస్ తీవ్రత ఉంటుంది. ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదు. వైరస్ సోకిన పిల్లలను ఐసోలేషన్‌లో ఉంచి, సాధారణ మందులు వాడితే సరిపోతుంది. వ్యాక్సిన్లపై అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



ఇంటింటికీ సీపీఐ పాల్గొన్న నాయకులు

మహేశ్వరం: భారత రాజ్యాంగాన్ని మార్చేసి మనువాద రాజ్యాంగాన్ని నిర్మించాలని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 'మోదీ హటావో దేశ్‌కీ బచావో'.. ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ముందుగా అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత పారిశ్రామిక వ్యవస్థను, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ ఆధ్వర్యంలో మే 15 వరకు 'బీజేపీ హటావో దేశ్‌కీ బచావో' పేరుతో ప్రజల వద్దకు వెళ్లి మోదీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఓడించి వామపక్ష ప్రగతిశీల లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో కూడిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీందర్‌చారి, నియోజకవర్గ కార్యదర్శి దత్తు నాయక్, మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ మండలాల పార్టీ కార్యదర్శులు పల్లాటి యాదయ్య, కె.రాజు, రమణారెడ్డి, నాయకులు ఎర్ర గణేశ్, క్రాంతి కుమార్, బ్రహ్మాచారి, నరేందర్, నాగేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'బ్లూటూత్' మాయ!

సైబర్ నేరస్తుల సరికొత్త మోసం

- బ్లూ బగ్గింగ్‌తో స్మార్ట్‌ఫోన్లు హ్యాకింగ్
- మాల్‌వేర్స్‌తో సెల్‌ఫోన్‌లోని డేటా తస్కరణ
- వాటి సహాయంతో బలవంతపు వసూళ్లు



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతున్నారు. బ్లూటూత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో దీన్నే అస్త్రంగా మలుచుకుంటున్నారు. బ్లూ బగ్గింగ్ పేరుతో కొత్త తరహా హ్యాకింగ్‌లకు పాల్పడుతూ మోసాలు చేస్తున్నారు. ఢిల్లీ, ఎన్సీఆర్, ముంబై వంటి ప్రధాన నగరాలలో బ్లూ టూత్ బగ్గింగ్ సైబర్ నేరాలు పెరిగిపోతుండటంతో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు.

బ్లూటూత్‌తో కనెక్ట్..

ప్రస్తుతం రోజుల్లో ప్రతీ ఎలక్ట్రానిక్ ఉపకరణం బ్లూటూత్‌తో అనుసంధానమైపోయింది. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్, స్మార్ట్‌ఫోన్, స్మార్ట్‌వాచ్‌లు, ఎయిర్‌బడ్స్, కారులోని మ్యూజిక్ సిస్టమ్ (కార్ ప్యూటర్), ఇంటిలోని ఫ్రిడ్జ్, ఏసీ, టీవీ వంటి గృహోపకరణాలు సైతం బ్లూటూత్‌తో కనెక్ట్ అవుతున్నాయి. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు బ్లూటూత్ అనుసంధానై ఉన్న ఎలక్ట్రానిక్ ఉపకరణాలను లక్ష్యంగా చేసుకొని పంజా విసురుతున్నారు.

పెయిర్ చేస్తే దొరికిపోయినట్టే..

సాధారణంగా హ్యాకర్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్‌ల ద్వారా లింకులు, సాఫ్ట్‌వేర్‌లు పంపించి హ్యాక్ చేస్తుంటారు. బ్లూ బగ్గింగ్ విధానంలో మాత్రం బ్లూటూత్‌ను అనుసంధానిస్తే చాలు హ్యాకింగ్ చేయొచ్చు. యూనిక్ నంబర్, అడ్రస్‌లతో రూపొందించిన మీడియా యాక్సెస్ కంట్రోల్ (ఎంఏసీ) బ్లూటూత్ నెట్‌వర్క్‌లో ఒకదానితో ఒకటి అనుసంధానించడానికి వీలు కల్పిస్తుంది. ఒకసారి పెయిర్ అయితే అవతలి వ్యక్తి ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని ట్రాక్ చేయడానికి వీలుంటుంది. సెల్ ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారాన్ని నేరస్తులు తస్కరించి, వీటి సహాయంతో బెదిరింపులకు పాల్పడుతుంటారు. బలవంతపు వసూళ్లు చేస్తుంటారు.

బ్లూ బగ్గింగ్ ఎలా చేస్తారంటే..

తొలుత హ్యాకర్ తన బ్లూటూత్ పేరును ఎదుటి వ్యక్తులు వినియోగిస్తున్న ఫోన్, ఇతర గాడ్జెట్స్ కంపెనీ పేరులాగా మార్చి కనెక్ట్ అయ్యేందుకు బ్లూటూత్ రిక్వెస్ట్ పంపిస్తారు. అది మనదే అని పొరపాటున పెయిర్ యాక్సెప్ట్ చేస్తే ఇక అంతే.. హ్యాకర్లు బ్రూట్‌ఫోర్స్ సాంకేతికత ద్వారా మన సెల్‌ఫోన్‌లోని లాగిన్ ఆధారాలు, ఎన్‌క్రిప్షన్ కీ, వెబ్‌పేజీలకు భంగం కలిగిస్తారు. దీంతో సెల్ ఫోన్ ఆన్‌లోనే ఉంటుంది కానీ, ఎలాంటి సందేశాలు రావు. తర్వాత సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకునేందుకు మాల్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేస్తాడు. అంతే మీ ఫోన్‌లోని కాంటాక్ట్‌లు, మెసేజ్‌లు, ఫొటోలు, ఆడియో, వీడియో రికార్డ్‌లు, ఈ–మెయిల్స్ ప్రతి ఒకటీ నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది.

ఇవీ జాగ్రత్తలు..

- బహిరంగ ప్రదేశాలలో ఉన్నప్పుడు అవసరమైతే తప్ప బ్లూ టూత్ వినియోగించకూడదు.
- గుర్తు తెలియని పరికరాలు, పరిచయం లేని వ్యక్తులు బ్లూ టూత్ ద్వారా పంపే పెయిరింగ్ రిక్వెస్ట్‌లకు స్పందించకూడదు.
- అవసరం లేకపోతే అప్పటివరకు అనుసంధానమైన బ్లూటూత్ పరికరాలను అన్ పెయిర్ చేసేయటం ఉత్తమం.
- డేటాలో హెచ్చుతగ్గులను గమనిస్తూ ఉండాలి. అదనపు భద్రతకు వీపీఎస్ వాడాలి.
- బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, బహిరంగ ప్రదేశాలలో ఉచిత వై–ఫైలను వినియోగించకూడదు.
- క్రమంతప్పకుండా ఎలక్ట్రానిక్ ఉపకరణాల సాఫ్ట్‌వేర్‌లను నవీకరించాలి.
- విశ్వసనీయత ఉన్న యాంటీ వైరస్‌లను మాత్రమే ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ మోసాలకు అప్రమత్తత ద్వారానే చెక్ పెట్టాలి. అందుకే రాచకొండ పరిధిలో సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. బాధితులు సంఘటన జరిగిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరులో లేదా 94906 17111 వాట్సాప్ నంబరులో ఫిర్యాదు చేయాలి. ఆలస్యం చేయొద్దు.

– బి.అనురాధ, డీసీపీ, సైబర్ క్రైమ్, రాచకొండ

క్లుప్తంగా

టెంట్ హౌస్ దగ్ధం

దుండగుల దుశ్చర్య



టెంట్ హౌస్‌లో మంటలు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు టెంట్ హౌస్‌కు నిప్పుపెట్టారు. గ్రామంలోని జంజం టెంట్ హౌస్‌ను యజమాని నిజాముద్దీన్ రోజులాగే యథావిధిగా గురువారం రాత్రి సామగ్రి లోపల పెట్టి షెటర్‌కు తాళం వేసి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో టెంట్ హౌస్‌కు నిప్పంటించారు. సామగ్రి, ఫర్నిచర్‌తో పాటుగా అందులో ఉన్న ద్విచక్రవాహనం దగ్ధమయ్యింది. టెంట్ హౌస్‌లో మంటలు వ్యాపించిన విషయాన్ని స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. శుక్రవారం ఉదయం విషయం తెలుసుకున్న బీజేపీ అధికార ప్రతినిధి కక్కునూరు వెంకటేశ్ గుప్తా.. దుకాణాన్ని సందర్శించి బాధితుడిని పరామర్శించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు నిజాముద్దీన్ తెలిపారు.

నిందితుడికి రిమాండ్

మీర్‌పేట: మహిళను దారుణంగా హత్య చేసిన నిందితున్ని మీర్‌పేట్ పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం మీర్‌పేట లెనిన్‌నగర్‌కు చెందిన రేణుక (36), ధాతునగర్‌లో నివసించే దుబ్బాల ప్రకాష్(24)లు కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. రేణుక ఇతరులతో చనువుగా ఉంటుందని అనుమానంతో హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 18న తాడుతో మెడకు బిగించి హత్య చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు ప్రకాష్‌ను అరెస్టు చేసి రిమాండ్ చేశారు.

కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం



ఆత్మీయసమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ఆలూరు క్లస్టర్‌లో ఆత్మీయ సమ్మేళనం

చేవెళ్ల: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని, ఈ ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ఖానాపూర్ బస్‌స్టేజీ వద్ద ఉన్న కల్యాణ మండపంలో శుక్రవారం క్లస్టర్‌పరిధిలోని ఆలూరు, దేవరంపల్లి, రేగడిఘనాపూర్, ఖానాపూర్, నాంచేరి,అంతారం, కౌకుంట్ల, హస్తేపూర్, మిర్జాగూడ, బస్తేపూర్ గ్రామాల నాయకులు, కార్యకర్తలతో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, డీసీఎంఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యమ నేత రాష్ట్రానికి రథసారధి అయితే అభివృద్ధి జరుగుతుందని, అందుకు మన రాష్ట్రమే నిదర్శనమన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా అనేక పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని అన్నారు. జాతీయ స్థాయి పంచాయతీ అవార్డులు ఎక్కువగా మన రాష్ట్రానికే రావటం అభివృద్ధికి నిదర్శనమని చెప్పారు. ముఖ్యమంత్రికి మనమంతా అండగా నిలబడి ఆయనను గెలిపించుకుంటే రానున్న కాలంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ నాయకులు చేవెళ్ల గడ్డ కు, జిల్లాకు ఏమి చేశారో ప్రజలకు చెప్పాలన్నా రు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం. విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం. మాలతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, వైస్ ఎంపీపీ కె. శివప్రసాద్, వైస్ చైర్మన్ బి. నర్సింహులు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శేరి శివారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బి. రవీందర్‌రెడ్డి, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు వనం లక్ష్మీకాంత్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, టీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు నరేందర్, పార్టీ మండల అధ్యక్షుడు పి. ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రామగౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

25న నియోజకవర్గ స్థాయి సమ్మేళనం

ఈనెల 25న నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని పార్టీ ఆదేశించిందని దీంతో పెద్ద ఎత్తున నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు తరలి రావాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండాలను ఎగురవేసి సమావేశానికి తరలి రావాలని చెప్పారు. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు ఈ ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీల నాయకులు సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.



ముస్లింలకు కానుకలు అందిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

రాష్ట్ర పథకాలను కాపీ కొడుతున్న కేంద్రం

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేత

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం పేర్లను మర్చి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ముస్లింలకు రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రెండు కోట్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను చూసి సమీపంలో ఉన్న ఇతర రాష్ట్రాల ప్రజలు తమను తెలంగాణలో కలపాలని కోరుతున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులకు అధికారం పైనే ధ్యాస ఉందని, ప్రజలకు సేవ చేసే ఉద్దేశం లేదని ఆయన అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిరంతరం విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. మిషన్ కాకతీయ పథకంతో చెరువుల్లో పూడికతీత పనులను చేపట్టినట్టు తెలిపారు. చెరువుల్లో పుడిక తీయడం వల్ల చెరువుల్లో నీరు నిల్వ ఉండి భూగర్భ జలాల మట్టం పెరిగిందన్నారు.

చెక్కుల పంపిణీ

మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో పలువురుకి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం అందించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అనురాధ, కేశంపేట, కొత్తపేట, బైర్కాన్‌పల్లి, పాపిరెడ్డిగూడ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలు శాంతియుతంగా నిర్వహించాలి

- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



మాట్లాడుతున్న కమిషనర్ డీఎస్ చౌహాన్

సాక్షి, సిటీబ్యూరో: రంజాన్ పండుగ శాంతియుతంగా నిర్వహించుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. రంజాన్ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జోనల్ డీసీపీలు, ఏసీపీలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సున్నితమైన ప్రాంతాల్లో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సామూహిక ప్రార్థనా కేంద్రాల వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ బందోబస్తును పర్యవేక్షించాలని, ఆయా ప్రాంతాల్లో సీసీటీవీల పనితీరుపై నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సామూహిక ప్రార్థనల సమయంలో రోడ్ల మీద ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా, ఇతర సాధారణ ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ బాలస్వామి పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- చేవెళ్లలో భారీ వర్షం
- బీజాపూర్ జాతీయ రహదారిపై కూలిన వృక్షం
- చనువెళ్లిలో విరిగిపడిన ఏకశిల ధ్వజస్తంభం

చేవెళ్ల: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు మండే ఎండలతో అలమటించిన ప్రజలకు ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మండలంలోని చనువెళ్లి, పామెన, బస్తేపూర్, మీర్జాగూడ, ఆలూరు, ఖానాపూర్, నాంచేరి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. మీర్జాగూడ సమీపంలో బీజాపూర్–హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీ మర్రి వృక్షం రోడ్డుపై పడిపోయింది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. దాదాపు గంట పాటు రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో కిలోమీటర్ల పొడువున ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ పోలీసులు సీఐ వాసు, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ చందర్‌నాయక్‌లు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో జేసీబీలతో చెట్టును పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. చనువెళ్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద ఉన్న ఏకశిల ధ్వజస్తంభం ఒక్కసారిగా కిందపడిపోవటంతో ముక్కలుముక్కలైంది. పలు గ్రామాల్లో వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. సాగులో ఉన్న పంటలకు తీవ్ర నష్టం కలిగిందని రైతులు వాపోయారు. పామెన గ్రామంలో ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోయింది. మండలంలో ఆరగంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో అంధకారం నెలకొంది.



రహదారిపై వృక్షం కూలడంతో నిలిచిన రాకపోకలు



జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



పామెన గ్రామంలో విరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పీసీసీ మాజీ కార్యదర్శి రాంరెడ్డికి షోకాజ్ నోటీసు

అబ్దుల్లాపూర్‌మెట్ : కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ వచ్చిన ఫిర్యాదులతో పీసీసీ మాజీ కార్యదర్శి దండెం రాంరెడ్డికి ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ జి. చిన్నారెడ్డి శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. రాబోయే ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని తానేనంటూ ప్రకటించుకోవడమే కాకుండా గ్రూపు రాజకీయాలకు పాల్పడుతున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. పార్టీకి నష్టం వాటిల్లే విధంగా వ్యవహరించడంతో పాటు బీఆర్‌ఎస్ నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారన్న వివిధ వర్గాల ఫిర్యాదు మేరకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

వ్యాపారి రామ్ ప్రసాద్ హత్య కేసు కొట్టివేత

- 2019లో పంజగుట్ట పరిధిలో దారుణ హత్య
- కోగంటి సత్యం సహా 12 మంది నిందితులుగా చార్జిషీట్
- నాంపల్లి కోర్టులో విచారణ
- సరైన సాక్ష్యాధారాలు లేనందున వీగిపోయిన కేసు

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన స్టీల్ వ్యాపారి తెలప్రోలు రాంప్రసాద్ హత్య కేసు వీగిపోయింది. విజయవాడలోని కామాక్షి స్టీల్స్‌కు సంబంధించిన వివాదం కారణంగా అక్కడి వ్యాపారి కోగంటి సత్యం సూత్రధారిగా ఈ హత్య జరిగినట్లు పంజగుట్ట పోలీసులు అభియోగాలు మోపారు. ఈ కేసులో ఆయనతో సహా మొత్తం 12 మంది నిందితులుగా ఉన్నారు. సుదీర్ఘ విచారణ తర్వాత సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును కొట్టివేస్తూ నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. విజయవాడకు చెందిన కోగంటి సత్యం కామాక్షి స్టీల్ ట్రేడర్స్ పేరుతో స్టీల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. 2013లో రాంప్రసాద్‌తో పాటు ఆయన మేనబావమరిది ఊర శ్రీనివాస్ ఈ సంస్థలో భాగస్వాములుగా చేరారు. దీని వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న రాంప్రసాద్‌కు సత్యం మధ్య స్పర్థలు వచ్చాయి. 2014లో పెద్దల సమక్షంలో సెటిల్‌మెంట్ చేసుకున్న వీళ్లు వేరుపడ్డారు. ఆ సమయంలో రూ.25 కోట్లు చెల్లిస్తానంటూ సత్యంకు రాంప్రసాద్ సెటిల్‌మెంట్ డీడ్ రాసి ఇచ్చారు. సెటిల్‌మెంట్ డీడ్‌ను బేఖాతరు చేసి తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వచ్చేశాడు. గచ్చిబౌలిలో నివాసం ఉంటూ పరిగిలో అభిరాం స్టీల్స్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి వ్యాపారం ప్రారంభించారు. దీని కార్పొరేట్ కార్యాలయం పంజగుట్ట దుర్గానగర్‌లోని ఓ భవనం మొదటి అంతస్తులో ఉంది. రాంప్రసాద్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్న కోగంటి సత్యం తన అనుచరుడు శ్యామ్‌కు ఆ పని అప్పగించాడు. అందుకు అవసరమైన ఖర్చుల కోసం రూ.10 లక్షలు కూడా చెల్లించాడు. ఈ నేపథ్యంలో శ్యామ్ అతడి మనుషులు పంజగుట్టలో కొన్ని రోజులు రెక్కీ చేసి 2019 జులైలో రాంప్రసాద్‌ను హత్య చేశారు. ఆ సమయంలో కోగంటి సత్యం సోమాజీగూడలోని ఓ ప్రముఖ ఆసుపత్రి సమీపంలో ఎదురు చూస్తూ గడిపారన్నది పోలీసుల అభియోగం. ఈ కేసులో నిందితులపై పంజగుట్ట అధికారులు కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును కొట్టివేస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది.

ఓయూలో ఇండో–పసిఫిక్ అధ్యయన కేంద్రం ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో నూతనంగా ఇండో–పసిఫిక్ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం దూరవిద్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ సురభివాణి దేవి, ఓయూ వీసీ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ తదితరులు ఇండో– పసిఫిక్ అధ్యయన కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇండియన్–పసిఫిక్ మహాసముద్ర తీర దేశాల మధ్య సత్సంబంధాలపై విస్తృతంగా అధ్యయనం చేసేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ ఓఎస్‌డీ అంబాసిడర్ రాజశేఖర్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, అధ్యాయాన కేంద్రం డైరెక్టర్ ప్రొ.జేఎల్‌ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.